క్లుప్తంగా

నేడు ఎంపీ రాక

రాజుపాళెం : మండలంలోని గోపాయపల్లె గ్రామానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బుధవారం రానున్నట్లు జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామంలో రామేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ఎంపీ హాజరవుతారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రొద్దుటూరు రూరల్ : రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించి, వాటి ఫలితాలకు అనుగుణంగా ఎరువుల యాజమాన్యం చేపడితే మేలైన దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పొలాలలో మట్టి నమూనాలను సేకరించి సచివాలయంలోని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా మట్టి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవడం వలన వారికి ప్రభుత్వం నుంచి ఏమైనా సూక్ష్మధాత ఎరువులైన జింక్, జిప్సం, బోరాన్ తదితర ఎరువులు ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. కావున రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

వైభవంగా హోమం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

రాజుపాళెం : మండలంలోని గోపాయపల్లె గ్రామంలో నూతనంగా పునర్నిర్మించిన రామేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వేద పండితులు కైపా ఆనందకుమార్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా హోమం నిర్వహించారు. ముందుగా ప్రాతఃకాల పూజ, యంత్ర అభిషేకం, గ్రామోత్సవం, ధాన్యాదివాసం కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు హోమం వద్దకు వచ్చి తిలకించారు. అనంతరం మహామంగళహారతి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

ఊరి బడి ఉనికి ప్రశ్నార్థకం

కాశినాయన : గ్రామాల్లో ఎంపీపీ పాఠశాలలు ఉంటాయా పోతాయా అనే ప్రశ్నార్థకంగా మారిందని ఎస్టీయూ సీపీఎస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 117 జీవోను రద్దు చేసి ఉన్నత పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను వెనక్కి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో 1,550 ఉన్నత పాఠశాలల్లో 1, 2 తరగతులను చేర్చి ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తుందని ఆయన విమర్శించారు. ఇదే సందర్భంలో తల్లికి వందనం ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం చేయాలన్న ఉపాధ్యాయ సంఘాల డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇదే జీవో కొనసాగితే గ్రామాల్లోని బడులు ఉనికి ప్రశ్నార్థకంగా అవుతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రాథమిక విద్యారంగాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

సమస్యను పరిష్కరించండి

కలసపాడు (పోరుమామిళ్ల) : డ్వాక్రా లోన్ మంజూరు చేయించేందుకు వెలుగు యానిమేటర్ బీబీచాంద్ డబ్బులు అడుగుతున్నారని చామంతి డ్వాక్రా గ్రూపు సభ్యులు వాపోయారు. పోరుమామిళ్ల పట్టణంలోని చిదానందనగర్‌లో 20 సంవత్సరాల నుండి డ్వాక్రా సంఘంలో ఉంటూ ప్రతి నెల లోన్ డబ్బులు బ్యాంకులో చెల్లిస్తున్నామని, లోన్ కూడా పూర్తయిందని తెలిపారు. అయితే లోన్ మంజూరుకు బీబీచాంద్ డబ్బులు డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. గ్రూపు సభ్యులు బ్యాంకుకు వెళ్లి తమకు లోన్ మంజూరు చేయాలని సిబ్బందిని అడుగగా మీ ఫైల్ మా వద్ద లేదని బీబీచాంద్‌ను అడగమని బ్యాంకు సిబ్బంది చెప్పినట్లు వారు తెలిపారు. బీబీచాంద్‌కు ఫోన్ చేస్తుంటే ఎటువంటి సమాధానం లేదని వాపోయారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రూపు సభ్యులు కోరుతున్నారు.

నివాళి



పిచ్చినాయుడు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట: పత్తూరు మాజీ సర్పంచ్ సారే పిచ్చినాయుడుకు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఘన నివాళి అర్పించారు. ఇటీవల పత్తూరు మాజీ సర్పంచ్ సారే పిచ్చినాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రఘురామిరెడ్డి మంగళవారం పత్తూరు వెళ్లి పిచ్చినాయుడు చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏపీఎస్ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ రాఘవరెడ్డి, కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, పత్తూరు మాజీ సర్పంచ్ ముసలయ్య, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, పత్తూరు వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణ పిచ్చినాయుడు కుటుంబానికి సంతాపం తెలిపారు.

‘పది’ ఫలితాల్లో పల్టీ

మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాలు తలకిందులయ్యాయి. పూర్తి స్థాయిలో ప్రణాళిక లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం ఫలితాలపై ప్రభావం చూపింది. పాఠ్య పుస్తకాలు కొత్తవి కావడం పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులకు అవగాహన తరగతులు నిర్వహించకపోవడం, తూతూమంత్రంగా బోధించడం.. వెరసి ఉత్తీర్ణత శాతం తగ్గింది. అధికారులు నిబంధనల ప్రకారం నెలవారీ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలి. ఇప్పుడలా చేపట్టకపోవడం ఫలితాలపై ప్రభావం చూపింది.

- నిరాశ పరిచిన ఫలితాలు
- సత్తా చాటని విద్యార్థులు
- ప్రణాళిక, పర్యవేక్షణ లోపమే



ఖాజీపేట బాలుర ఉన్నత పాఠశాల

ఖాజీపేట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు, ఉపాధ్యాయులు ఉన్నా పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు వెనుకబడ్డారు. ముఖ్యంగా ఖాజీపేట బాలుర ఉన్నత పాఠశాలలో పది పరీక్షలు 59 మంది రాశారు. అందులో 42 మంది విద్యార్థులు ఫెయిల్ కాగా కేవలం 17 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఇంత దారుణ ఫలితాలు సాధించడం స్కూల్ చరిత్రలోనే ఇదే తొలిసారి. అప్పనపల్లె బాలుర ఉన్నత పాఠశాలలో 28 మంది పరీక్షలు రాశారు. అందులో కేవలం 12 మంది మాత్రమే పాస్ అయ్యారు. అలాగే కొత్తపేట బాలుర ఉన్నత పాఠశాలలో 29 మందికి గాను 13 మంది పాస్ అయ్యారు. ఈ మూడు పాఠశాలల్లో పాస్ అయిన వారి కంటే ఫెయిల్ అయిన విద్యార్థులే అధికంగా ఉండటం విశేషం.

ఉత్తమ ప్రతిభ

మండలంలోని ఉర్దూ స్కూల్‌లో 22 మందికి గాను 21 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా కేవలం ఒక్క విద్యార్థి మాత్రమే ఫెయిల్ అయ్యాడు. మండలంలోనే అధిక ఉత్తీర్ణత శాతం 95 శాతంగా నమోదు చేసుకుంది. అలాగే మోడల్ స్కూల్‌లో 91 మంది విద్యార్థులకు గాను 81 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 89 శాతం ఉత్తీర్ణులయ్యారు. వై. రెడ్డి రోషిత అనే విద్యార్థి 572 మార్కులు సాధించి మండలంలో టాపర్‌గా నిలిచింది. కస్తూర్బాగాంధీ స్కూల్‌లో 35 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 28 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. ఏడుగురు ఫెయిల్ అయ్యారు. 80 శాతం ఉత్తీర్ణత సాధించి మూడే స్థానాన్ని ఈ పాఠశాల దక్కించుకుంది.

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం



మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేదు. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయులు విఫలమయ్యారు. సరైన ప్రణాళిక అమలు చేయలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. అందువల్లే నిరాశజనక ఫలితాలు వచ్చాయి. మార్పు కోసం అందరూ కృషి చేయాలి.

– డాక్టర్ తవ్వా వెంకటయ్య, రాష్ట్ర తెలుగు బాషా సంఘం మాజీ సభ్యుడు

బాధ కలిగించాయి



ప్రభుత్వ పాఠశాలల్లోని ఫలితాలు బాధ కలిగించాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు అన్ని పాఠశాలలకు మెరుగైన వసతులు కల్పించారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులు దృష్టి సారించి వచ్చే ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలి.

– పీపీ రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ

ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థులు

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బద్వేలు మున్సిపాలిటీ, రూరల్ ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 93 శాతం మంది విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకాన్ని వర్తింపజేసి వారి ఉజ్వల భవిష్యత్తుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని కొనియాడారు. అంతేకాకుండా 20 లక్షల ఉద్యోగాలు లేదా ప్రతి నెల రూ.3 వేలు చొప్పున నిరుద్యోగభృతి చెల్లిస్తామంటూ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఆ హామీలకు తూట్లు పొడుస్తూ బడ్జెట్‌లో సైతం నిధులు కేటాయించలేదని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి యువత, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా విద్యార్థి విభాగాన్ని బలోపేతం చేయాలని, ఇందుకోసం పార్టీలో చురుగ్గా పాల్గొనే విద్యార్థులకు, యువతకు బాధ్యతలు అప్పగించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు పుత్తా శ్రీరాములు, కేశవరెడ్డి, సుబ్బారెడ్డి, ఏరియా కన్వీనర్ చెన్నకృష్ణారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు రఘురామిరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సాయినారాయణరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవసాని ఆదిత్యరెడ్డి

బాల్య వివాహంతో అనర్థం



బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

చాపాడు: బాల్య వివాహాలతో అనర్థాలు తప్పవని, వీటిని నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను అమల్లోనికి తెచ్చాయని ఐడీసీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ పేర్కొన్నారు. మండలంలోని అల్లాడుపల్లె అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే సమాజహితం కోరే ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని కోరారు. బాల్య వివాహాలు జరిగే అవకాశం ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి కాల్ చేయాలని, లేకుంటే అంగన్వాడీ వర్కర్లు, గ్రామంలోని మహిళ పోలీసులకు గానీ, ఐసీడీఎస్ సిబ్బందికి గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాలతో మానసికంగా శారీరకంగా నష్టపోతారని తెలిపారు. ప్రసవ సమయంలో తల్లీబిడ్డకు ప్రాణహాని ఉంటుందన్నారు. బాల్య వివాహాలు జరిగితే చట్ట రీత్యా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



మైదుకూరు : నిరాహార దీక్షను ప్రారంభిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు



బద్వేలు అర్బన్ : రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఎన్ఎంయూఏ నాయకులు

మైదుకూరు : సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఉద్యోగుల పోరుబాట పట్టారు. ఆందోళనలో భాగంగా మైదుకూరు ఆర్టీసీ డిపో వద్ద రెండో రోజు మంగళవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులు ఉద్యోగుల పట్ల వ్యతిరేక ధోరణిని చూపుతున్నారని ఆరోపించారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా మైదుకూరు డిపోలో ఏప్రిల్ 2, 3 తేదీలల్లో ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపామన్నారు. ఈనెల 10, 11 తేదీల్లో పెద్ద ఎత్తున గేట్ మీటింగ్ నిర్వహించి నిరసన తెలిపామని, ఈనెల 17న మెమొరాండంలోని అంశాలు ప్లకార్డుల ద్వారా ప్రదర్శించి నిరసన తెలిపామని వివరించారు. ఇప్పుడు నిరాహార దీక్షలు చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రెండో రోజు డిపోకు చెందిన కండక్టర్లు ఎ.రాజా, ఏపీ కృష్ణయ్య నిరాహార దీక్ష చేపట్టారు. సీసీఎస్ డెలిగేట్ ఎన్వీ నరసింహులు, డిపో ప్రెసిడెంట్ ఎస్.నాగరాజు, ఎం.వెంకటేశ్వర్లు, గ్యారేజ్ సెక్రటరీ వైఎస్ రాయుడు తదితరులు వారికి మద్దతు తెలిపారు.

పాత వైద్య విధానాన్ని కొనసాగించాలి

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కార్డు స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.జనార్ధన్‌రావు, డిపో సెక్రటరీ చంద్రయ్య డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెండవ రోజైన మంగళవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిపో ఆవరణలో ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్ ఆపడంతో పాటు నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్స్‌ను వెంటనే ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు అత్యవసర సమయాల్లో మూడు రోజులు సెలవు ఇవ్వడంతో పాటు మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ లీవ్‌లు మంజూరు చేయాలని కోరారు. 114 జీవోలో పొందుపరిచిన ప్రకారం నైట్‌అవుట్ అలెవన్స్‌లను రూ.150 నుండి రూ.400లకు పెంచాలని డిమాండ్ చేశారు. గ్యారేజీ సెక్రటరీ నాగేంద్ర, సీసీఎస్ డెలిగేట్ మల్లికార్జున, అసోసియేషన్ నాయకులు ఎస్.కె.బాష, వెంకటభాస్కర్‌రెడ్డి, పిచ్చయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

నేటి నుంచి శంకరాచార్యుల జయంత్యుత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక లైట్ పాలెం సెంటర్‌లోని ఎంవీఎస్ శ్రీకైవల్య సత్సంగం ధ్యాన మందిరంలో బుధవారం నుంచి మే 1, 2 తేదీలలో శ్రీశంకర జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు శ్రీకై వల్య సత్సంగం సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజు ఉదయం 9 నుంచి 1గంట వరకు, సాయంత్రం 5.30 నుంచి 8 గంటల వరకు పారాయణం, ఉపన్యాసాలు ఉంటాయని వారు పేర్కొన్నారు. మే 3న నుంచి 25వ తేదీ వరకు ఉదయం 7.30 నుంచి 9.30 గంటలకు భగవద్గీత వేసవి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.

అల్లాడుపల్లె వీరభద్రస్వామికి రూ.4.41 లక్షల ఆదాయం

చాపాడు: ముఖ్య పుణ్యక్షేత్రమైన మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో మంగళవారం దుకాణ గదులు, పొలం, టీటీడీ కల్యాణ మండపం నిర్వహణ హక్కు కోసం వేలం పాట నిర్వహించారు. ఈ వేలం ద్వారా అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామికి రూ.4,41,400లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ఆలయ ఈఓ శ్రీనివాసులు, మైదుకూరు కార్యనిర్వహణాధికారి ప్రసాద్ రావు పర్యవేక్షణలో వేలం పాట జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు లేవా?

- ఉక్కపోతకు అల్లాడుతున్న పిల్లలు
- సెలవుల ఊసే ఎత్తని ప్రభుత్వం
- తగ్గుతున్న హాజరు శాతం
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు



అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్డు తింటున్న చిన్నారులు

కాశినాయన : ఎండలు దంచికొడుతున్నాయి. పెద్దలు ఎండలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. కానీ చిన్న పిల్లలు ఉండే అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం సెలవులు ఇవ్వకపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు కేంద్రాలకు పిల్లలను పంపడం లేదు. ఫలితంగా హాజరు శాతం తగ్గిపోయింది. పెద్ద పిల్లలకు సెలవులు ఇస్తున్న ప్రభుత్వం చిన్న పిల్లల విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదంటూ చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోరుమామిళ్ల ఐసీడీఎస్ పరిధిలో కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ళ మండలాల్లో 138 అంగన్‌వాడీ కేంద్రాలు, 30 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఇందులో ఒకటి నుంచి 6 సంవత్సరాల పిల్లలు దాదాపు 6,300కు పైగా కేంద్రాల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వేసవి సెలవుల్లో అన్ని పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మాత్రం మండు వేసవిలో కేంద్రాలకు రావాల్సిన దుస్థితి నెలకొంది. మే 1 నుంచి అంగన్‌వాడీ టీచర్లకు నెలలో 15 రోజులు, మరో 15 రోజులు సహాయకులకు సెలవులు మంజూరు చేశారు. ఒకే కార్యకర్త ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నెల రోజులు ఒకరే పనిచేయాల్సి పరిస్థితులు నెలకొన్నాయి. ఆరు సంవత్సరాలలోపు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తారు. వీరికి వేసవి సెలవులు ఇవ్వకపోవడంతో హాజరుశాతం తగ్గిందని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

అల్లాడుతున్న పిల్లలు

ఉదయం 7 గంటల నుంచే ఎండలు ఎక్కువగా కాస్తున్నాయి. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు ఉన్నప్పటికీ ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. మధ్యలో విద్యుత్ సరఫరా పోతే వారి పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. దీంతో తల్లిదండ్రులు పిల్లలను పంపించకుండా ఇంటివద్దనే ఉంచుకుంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా అన్ని పాఠశాలలతో పాటు సెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మొక్కుబడిగా సమావేశాలు నిర్వహిస్తే ఎలా?

- గైర్హాజరైన అధికారులపై ఫిర్యాదు చేయండి
- ఎమ్మెల్యే డాక్టర్ సుధ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : సమావేశానికి కీలకశాఖల అధికారులు హాజరు కారు.. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు సకాలంలో అమలు చేయరు.. మొక్కుబడిగా సమావేశాలు నిర్వహిస్తే ఎలా అని ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్‌జీవోకాలనీలోని మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో వివిధ హౌసింగ్ లేఅవుట్లలో పక్కా గృహాలు మంజూరైన 1081 మంది లబ్ధిదారులకు అనుబంధ పత్రాలు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంపై చర్చిద్దామనుకుంటే బద్వేలు, గోపవరం మండలాల తహసీల్దార్లు గాని కార్యాలయ సిబ్బంది గానీ హాజరు కాలేదని, ఇలాగైతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని అసహనం వ్యక్తం చేశారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని 2, 3వ వార్డుల్లో విద్యుత్ సమస్యలు ఉన్నట్లు సంబంధిత కౌన్సిలర్లు తెలుపుతున్నారని, వాటి గురించి చర్చించేందుకు కూడా విద్యుత్‌శాఖ సిబ్బంది ఎవరూ హాజరు కాలేదని అన్నారు. ఆహ్వానం ఉన్నప్పటికీ సమావేశానికి హాజరు కాని ఆయా శాఖల అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు.

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని విద్యానగర్ సమీపంలో గల శ్మశానవాటిక ఆక్రమణకు గురవుతోందని, ఈ శ్మశానవాటికను నాలుగు వార్డుల ప్రజలు ఉపయోగించుకుంటున్నారని, ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి సమావేశం దృష్టికి తీసుకురాగా.. ఇప్పటికే ఈ అంశంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని, వారు వచ్చి హద్దులు చూపగానే ఆక్రమణలను తొలగించి కంచె ఏర్పాటు చేస్తామని టౌన్‌ప్లానింగ్ అధికారి తెలిపారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోలు బంకు ద్వారా మున్సిపాలిటీకి ఎంత ఆదాయం వస్తుందో తెలపాలని 13వ వార్డు కౌన్సిలర్ హసాన్ ప్రశ్నించగా.. రాబోవు సమావేశంలో పూర్తి వివరాలు తెలుపుతామని మున్సిపల్ అధికారులు తెలిపారు. వార్డులో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదని, చేతి బోరు మరమ్మత్తులకు గురైతే కూడా పట్టించుకోవడం లేదని 5వ వార్డు కౌన్సిలర్ రత్నమ్మ సమావేశం దృష్టికి తీసుకురాగా తక్షణమే సిబ్బందిని పంపి సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ సమాధానమిచ్చారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, డీఈ సుమన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో విజ్ఞానంతో పాటు వినోదం



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించడంతోపాటు వినోదాన్ని పంచుతాయని మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ అన్నారు. స్థానిక రామేశ్వరంలోని బాల బాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళవారం విద్యార్థులకు జిరాఫీ చెస్, ఖోఖో, క్యారంబోర్డు, కబడ్డీ ఆటలలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ మాట్లాడుతూ చదరంగం, ఖోఖో, కబడ్డీ ఆటల వలన విద్యార్థులకు నైపుణ్యం ,జ్ఞాపకశక్తి, ఏకాగ్రత ఏర్పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జిరాఫీ చెస్‌లు కోచ్ నాగార్జున, అరవింద్, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, హైస్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం



మాట్లాడుతున్న షేక్ సలీం, హిదాయతుల్లా

ప్రొద్దుటూరు కల్చరల్ : వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని జేఏసీ సభ్యులు పేర్కొన్నారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ప్రొద్దుటూరు జేఏసీ ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా లైట్లు ఆఫ్ చేసి నిరసన తెలపాలని కోరారు. మంగళవారం జేఏసీ సభ్యులు షేక్ సలీం, హిదాయతుల్లా, మౌలానా మక్బుల్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరుతూ బుధవారం రాత్రి 9 గంటల నుంచి 9.15 గంటల వరకు లైట్ల స్విచ్ ఆఫ్ చేసి నిరసన తెలిపాలని పట్టణ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, లౌకిక వాదులు, రాజ్యాంగ పరిరక్షణ వాదులు, కుల, మతాలకతీతంగా ప్రజలందరూ ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ గృహాలు, ఆఫీసులు, షాపుల్లో లైట్లు ఆఫ్ చేసి నిరసన తెలిపి జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధి అవకాశాలు పెంచేందుకే ట్రయల్ రన్

ప్రొద్దుటూరు కల్చరల్ : యువతలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు జక్క జ్యోతి ఫుడ్స్ ప్రొడక్ట్స్ ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు ప్రొద్దుటూరులో ఫుడ్స్ సీఈఓ జక్క పెద్దన్న తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కొర్రపాడు రోడ్డులోని తమ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఉపాధి, ఉద్యోగాల కోసం 100 రోజుల పీ4 ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో తమ వద్ద అందుబాటులో ఉన్న ఇన్వెస్టర్ల ద్వారా ప్రతి ఊరిలో ఇద్దరికి ఉపాధి, మరో 20 మందికి వర్క్ ఫ్రమ్ హోం అవకాశం కల్పిస్తామని చెప్పారు.